మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నాయకులు

మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఆహ్వానం

కొండపాక(కుకునూరుపల్లి), నవంబర్ 19 : కుకునూరుపల్లి మండలంలోని ముద్దాపూర్‌లో ముదిరాజ్‌ల కుల దైవం పెద్దమ్మ-పెద్ది రాజుల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరు కావాలని మంగళవారం ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ముద్దాపూర్ మదిరాజ్ సంఘం నాయకులు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఎంపీటీసీల ఫోరం మాజీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీ రవీందర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అమరేందర్, బీఆర్ఎస్ ఉమ్మడి కొండపాక మండలాధ్యక్షుడు కుమార్, మహిపాల్, ముదిరాజ్‌సంఘం నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పల్లా పరామర్శ

చేర్యాల, నవంబర్ 19: పట్టణానికి చెందిన ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి అందె బీరయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో మంగళవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆయన్ను పరామర్శించారు. శభాష్‌గూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు మడిపడిగె కనకయ్య, దండ్ల కిష్టయ్య ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురికావడంతో వారిని పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన విద్యార్థి కడుపునొప్పి భరించలేక ఆత్మహత్యకు పాల్పడడంతో ఆయన తండ్రి గాడిపల్లి నర్సింహులును పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు.పెద్దరాజు పేటకు చెందిన అంకని దేవయ్య మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. అనారోగ్యానికి గురై చికిత్స చేయించుకున్న బీఆర్ఎస్ నాయకుడు బొంగురం రాములును పరామర్శించారు. కార్యక్రమాల్లో సీనియర్ నాయకుడు అంకుగారి శ్రీధర్ రెడ్డి, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ మంగోలు చంటి, బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్, వైస్ ఎంపీపీ తాండ్ర నవీన్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు పెడుతల ఎల్లారెడ్డి, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గదరాజు చందు, బండమీది కరుణాకర్, తాడెం రంజితాకృష్ణమూర్తి, బొంగు రాజేందర్‌రెడ్డి, అరిగె కనకయ్య పాల్గొన్నారు.

పెద్దరాజుపేటలో బీఆర్ఎస్ నాయకుడు బొంగురం రాములును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

పారిశుధ్య పనుల పరిశీలన

గజ్వేల్, నవంబర్ 19: పట్టణంలోని ఆయా వార్డుల్లో పారిశుధ్య పనులను కమిషనర్ గోల్కొండ నర్సయ్య మంగళవారం పరిశీలించారు. వార్డుల్లో కొనసాగుతున్న కుల గణన సర్వేను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్వే త్వరగా పూర్తి చేయాలని, అందుకు పట్టణ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న గజ్వేల్ మున్సిపల్ కమిషనర్ నర్సయ్య

పాదయాత్రను విజయవంతం చేయాలి

మిరుదొడ్డి, నవంబర్ 19: సిద్దిపేట జిల్లాలో ఈనెల 21, 22వ తేదీల్లో కొనసాగే మాల మహానాడు మహా పాదయాత్రను విజయవంతం చేయాలని మాజీ ఎంపీపీ గజ్జల సాయిలు, అడ్వకేట్ పెద్దలింగన్న గారి ప్రసాద్ అన్నారు. మంగళవారం మిరుదొడ్డి టౌన్‌లో మాల మహానాడు మహా పాదయాత్ర వాల్ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మండల యాదగిరి, పాద యాత్ర జిల్లా కో-కన్వీనర్ దారస్వామి, సీనియర్ నాయకులు సుదర్శన్, రాజలింగం, చంద్రం, శ్రీనివాస్, మహేశ్, రత్నం పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీపీ గజ్జల సాయిలు

ఎస్సీ, ఎస్టీలపై దాడులను అరికట్టాలి

గజ్వేల్, నవంబర్ 19: జిల్లాలో రోజు రోజుకూ ఎస్సీ, ఎస్టీలపై దాడులు పెరుగుతున్నాయని డీబీఎఫ్(దళిత బహుజన ఫ్రంట్) జాతీయ కార్యదర్శి పి.శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం గజ్వేల్‌లో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఏదో ఒక ప్రాంతంలో ఎస్సీ, ఎస్టీలపై దాడులు, అత్యాచారాలు, అవమానాలు, సాంఘిక బహిష్కరణలు, హత్యలు, భూముల ఆక్రమణలు నిత్యకృత్యంగా మారాయన్నారు. జగదేవ్‌పూర్ మండలం తిమ్మాపూర్, సిద్దిపేట మండలం పెద్దలింగారెడ్డిపల్లిలో సాంఘిక బహిష్కరణలు, మర్కూక్ మండలం శివారు వెంకటాపూర్, సిద్దిపేట మండలం సీతారాంపూర్‌లో దేవాలయాల ప్రవేశాన్ని నిరాకరించారన్నారు. కులాంతర వివాహాల జంటలకు రక్షణ లేదని, ఎస్సీ, ఎస్టీ బాలికలపై సామూహిక లైంగికదాడులు పెరుగుతున్నాయన్నారు. అంబేద్కర్ విగ్రహాలను గ్రామ నడిబొడ్డున ఏర్పాటు చేయడాన్ని దౌల్తాబాద్ మండలం గువ్వలపల్లి, మందాపూర్, గజ్వేల్ మండలం గిరిపల్లి గ్రామాల్లో అడ్డుకుంటున్నారన్నారు. డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎగొండ స్వామి, జిల్లా కార్యదర్శి వేణు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

ఇచ్చిన మాటను సీఎం నిలబెట్టుకోవాలి

గజ్వేల్, నవంబర్ 19: దేశంలో ఎస్సీ వర్గీకరణను అమలు చేసే తొలి రాష్ట్రంగా తెలంగాణ ఉంటుందని అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేశ్ అన్నారు. మంగళవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్గీకరణ జాప్యం చేస్తే ప్రభుత్వంపై యుద్ధమే జరుగుతుందన్నారు. ఎన్నో ఏండ్లుగా చేసిన పోరాటంతో వర్గీకరణకు అనుకూల తీర్పు వచ్చిందని, అన్ని రాష్ట్రాల్లో త్వరగా వర్గీకరణ చేయాలని అప్పుడే ఉద్యోగాల భర్తీ చేపట్టాలన్నారు. వెంటనే ప్రభుత్వం వర్గీకరణకు అమలులోకి తీసుకురావాలని, ప్రస్తుతం చేపట్టే ఉద్యోగాల నియామకాలను నిలిపివేసి, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం నడుచుకోవాలన్నారు. సమావేశంలో రాష్ట్ర కో ఆర్డినేటర్ వెంకటస్వామి, ఎంఈఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదగిరి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ విఫలం

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్ 19: ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి విమర్శించారు. మంగళవారం మద్దూరు మండల కేంద్రంలోని తాజ్‌మహల్ గార్డెన్‌లో సీపీఎం ఆరో మండల మహాసభను మహ్మద్ షఫీ, సుంకోజు ప్రశాంత్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాలనను పక్కనబెట్టి హైడ్రాపేరుతో హైడ్రామా చేస్తున్నదని దుయ్యబట్టారు. కేంద్రంలోని మోదీ సర్కార్ కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్నదని విమర్శించారు. అంతకుముందు మద్దూరు చౌరస్తాలో సీపీఎం జెండాను కార్యకర్తలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కాముని గోపాల్‌స్వామి, రాళ్లబండి శశిధర్, జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట్‌మావో, శెట్టిపల్లి సత్తిరెడ్డి, చొప్పరి రవికుమార్, దాసరి ప్రశాంత్, చేర్యాల, కొమురవెల్లి మండల కార్యదర్శులు బండకింది అరుణ్‌కుమార్, తాడూరి రవీందర్ పాల్గొన్నారు.

మద్దూరులో సీపీఎం జెండాను ఆవిష్కరిస్తున్న ఆముదాల మల్లారెడ్డి

చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధనే బీఆర్ఎస్ లక్ష్యం

- ఐక్య పోరాటాలతో డివిజన్ ఏర్పాటు ఖాయం
- త్వరలో చేర్యాలలో భారీ బహిరంగ సభ
- అధికార పార్టీ జేఏసీ ఏర్పాటు చేయడం విడ్డూరం
- రెవెన్యూ డివిజన్ కోసం సాధన సమితి ఏర్పాటు
- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



చేర్యాలలో బీఆర్ఎస్ నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, నవంబర్ 19: ప్రజల ఆకాంక్ష మేరకు చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధించడమే బీఆర్ఎస్ లక్ష్యమని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. రెవెన్యూ డివిజన్ సాధన కోసం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రూపొందించాల్సిన ఉద్యమ కార్యాచరణ తదితర అంశాలపై పట్టణంలోని ఈడెన్ గార్డెన్స్‌లో మంగళవారం చేర్యాలటౌన్, చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నాయకుల నుంచి అభిప్రాయాలు సేకరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం జరిగిన మొదటి అసెంబ్లీ సమావేశంలోనే చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశానని, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గతంలో చేర్యాల రెవెన్యూ డివిజన్ ఉద్యమానికి మద్దతు ఇచ్చారన్నారు.చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తేనే ఈ ప్రాంతానికి పూర్వ వైభవం వస్తుందని, ప్రజలు సంతోషంగా ఉంటారన్నారు. అధికార కాంగ్రెస్ జేఏసీ ఏర్పాటు చేయడం విడ్డూరంగా ఉందని,ప్రధాన ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక, కుల సంఘాలతో సంప్రదింపులు జరిపి ఐక్య పోరాటాలకు శ్రీకారం చుడుతామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అనంతరం ఏటూరునాగారాన్ని డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేశారని, మరికొన్ని గ్రామాలను మండలాలుగా ఏర్పాటు చేసి చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఎందుకు ఏర్పాటు చేయలేదని ఆయన ప్రశ్నించారు.కాంగ్రెస్ ఎన్నికల ప్రచార సభలో (జనగామలో) రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు డివిజన్ ఏర్పాటులో తాత్సార్యం ఎందుకని, వెంటనే డివిజన్ ఏర్పాటు చేయాలని లేని పక్షంలో అధికార పార్టీ నేతలను ఎక్కడికక్కడ నిలదీస్తామన్నారు. డివిజన్ ఏర్పాటు కోసం శాంతియుతంగా ఉద్యమాలు నిర్మిస్తామని, అన్ని పార్టీల నేతలను కలిసి వారి అభిప్రాయాలు, సూచనలతో ముందుకు వెళ్తామన్నారు. కార్మిక సంఘాలు, వ్యాపార, వాణిజ్య వర్గాలు, వైద్యులు, అడ్వకేట్లు, జర్నలిస్టులు, యువజన సంఘాలు, రిటైర్డు ఉద్యోగులను కలిసి వారితో చర్చించి రెవెన్యూ డివిజన్ సాధన సమితి ఏర్పాటు చేస్తామని, కమిటీ ఏర్పాటు అనంతరం చేర్యాలలో బహిరంగ సభ ఏర్పాటు చేసి ప్రజల ఆకాంక్షను ప్రభుత్వ దృష్టికి తీసుకుపోతామన్నారు. సమావేశంలో ముస్త్యాల బాల్‌నర్సయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగిల్ల తిరుపతిరెడ్డి,బీఆర్ఎస్ నాలుగు మండలాల అధ్యక్షులు మేక సంతోష్, మంద యాదగిరి, అనంతుల మల్లేశం,మాజీ ఎంపీపీలు మేడిశెట్టి శ్రీధర్, తలారి కీర్తనాకిషన్, ఏఎంసీ మాజీ చైర్మన్ సుంకరి మల్లేశంగౌడ్, మాజీ వైస్ చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీలు సిలువేరు సిద్దప్ప, నాచగోని పద్మావెంకట్‌గౌడ్,యూత్ ఇన్‌చార్జి శివగారి అంజయ్య, పచ్చిమడ్ల మానస, మీస పార్వతి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై సమీక్ష

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్ 19: ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై మద్దూరు తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ మహ్మద్ ఏజీ రహీం అధ్యక్షతన సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నియోజకవర్గ స్పెషలాఫీసర్ శ్రీరాంరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సర్వే జరిగిన విధానంపై వివరాలు సేకరించడమే కాకుండా ఆన్‌లైన్ చేసే ప్రక్రియ గురించి శ్రీరాంరెడ్డి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ధూళిమిట్ట తహసీల్దార్ మధుసూదన్, ఎంపీడీవో రామ్మోహన్, ఆర్ ఐలు రమేశ్, రవీందర్ పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో కులగణన 65శాతం పూర్తి

హుస్నాబాద్‌టౌన్, నవంబర్ 19: హుస్నాబాద్ పట్టణంలో కులగణన సర్వే మంగళవారం వరకు 65శాతం పూర్తిచేశారు. పట్టణంలోని ఇరువై వార్డుల్లో కులగణన సర్వేను ఎన్యూమరేటర్లు నిర్వహిస్తున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సమాచారం ఇవ్వాలని సూచిస్తూ సర్వే పత్రాలను నింపుతున్నారు. పట్టణంలో 7,360 కుటుంబాలకు 4,700కుటుంబాలకు చెందిన సర్వేను పూర్తిచేసినట్లు హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్ తెలిపారు.

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ స్పెషలాఫీసర్ శ్రీరాంరెడ్డి

చెత్తను కాల్చితే కఠిన చర్యలు

- సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్

సిద్దిపేట, నవంబర్ 19: సిద్దిపేట పట్టణంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ పర్యటించారు. మైత్రివనం హౌసింగ్ బోర్డు పార్కుల నిర్వహణను పరిశీలించారు. చిన్న పిల్లలకు ఇష్టమైన ఆట స్థలాలు, పరికరాలకు వెంటనే మరమ్మతు చేయించాలని అధికారులను ఆదేశించారు. రోజూ మొక్కలకు నీరు పట్టేలా ఒక వ్యక్తిని నియమించాలని సూచించారు. ఓపెన్ జిమ్, మూత్రశాలలకు మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. రోడ్డు పక్కన చెత్త కాల్చడాన్ని గమనించిన ఆయన వాహనం దిగి మరోసారి చెత్తను కాల్చినట్లయితే చర్యలు తీసుకుంటామని వారికి అవగాహన కల్పించారు. చెత్తను మున్సిపల్ వాహనాలకు అందించాలని సూచించారు. కోమటి చెరువు వద్ద ప్రభుత్వ దవాఖాన వారు చెత్తను వేరు చేయకుండా ఇవ్వడాన్ని గమనించి వారికి రూ.50 వేల జరిమానా విధించారు. హానికరమైన చెత్తను వేరు చేసి ధర్మా ఏజెన్సీకి అందించాలని, గతంలో రెండు సార్లు దవాఖానకు వచ్చి తెలిపినా వారిలో మార్పు రాకపోవడం వల్లనే జరిమానా విధించామన్నారు. ఎస్సీ బాలుర గృహం, గిరిజన కళాశాల, బాలుర వసతి గృహాలను సందర్శించి వంటశాల, మూత్రశాలను పరిశీలించారు. వంటశాలలో సామగ్రిని ప్లాస్టిక్ డబ్బాలో భద్రపర్చడాన్ని గమనించి ప్లాస్టిక్ డబ్బాలో వస్తువులు భద్ర పర్చవద్దని సూచించారు. విద్యార్థులకు శుభ్రమైన ఆహారాన్ని అందించాలని సూచించారు.

ప్రభుత్వ దవాఖానలో చెత్తను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

గజ్వేల్, నవంబర్ 19: జాతీయాస్థాయి వాలీబాల్ పోటీలకు ఆర్‌అండ్‌ఆర్ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.పవిత్ర ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం కరీముద్దీన్, ఫిజికల్ డెరెక్టర్ ప్రశాంత్ తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లో డిసెంబర్ 10 నుంచి 14వరకు జరిగే అండర్-14 ఎస్‌జీఎఫ్ వాలీబాల్ క్రీడలో పాల్గొననున్నది. ఇటీవల చేగుంటలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో మెదక్ జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ జట్టుకు ప్రాతినిధ్యం వహించి అద్భుతంగా ఆడడంతో జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని పవిత్రను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

పవిత్ర

కల్లుగీత వృత్తిని పరిరక్షించుకోవాలి

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్ 19: కంఠమయ్య స్ఫూర్తితో కల్లుగీత వృత్తిని పరిరక్షించుకోవాలని కల్లుగీతకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బండకింది అరుణ్‌కుమార్ కోరారు. మంగళవారం మద్దూరు మండలంలోని వంగపల్లిలో కల్లుగీతకార్మిక సంఘం(కేజీకేఎస్) జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో భూయజమానులు తాటి, ఈత చెట్లను ఇష్టానుసారంగా తొలిగిస్తుండడంతో గీతకార్మికులు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాటి, ఈత చెట్ల పెంపకం కోసం సొసైటీకి ఐదు ఎకరాల భూమి ఇవ్వాలని, గతంలో ప్రభుత్వం 560జీవో జారీ చేసినప్పటికీ ఆచరణలో అమలు కావడం లేదన్నారు. తాటి చెట్లపై నుంచి కిందపడి ఎంతోమంది గీతకార్మికులు చావుబతుకుల మధ్య జీవితాలను గడుపుతున్నారని వారికి ప్రభుత్వం వెంటనే ఎక్స్‌గ్రేషియా అందజేసి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ నాయకులు కూరెళ్ల రవీందర్, శంకరయ్య, కిష్టయ్య, శ్రీనివాస్, బొంగోని విజయ్, తిరుపతి, వెంకటయ్య,నలుగొప్పుల రాజు, శ్రీనివాస్ యాదగిరి, బొంగోని సాగర్ అంజయ్య, కనకయ్య, రామస్వామి, సత్తయ్య, పరశురాములు పాల్గొన్నారు.

జెండాను ఆవిష్కరిస్తున్న అరుణ్‌కుమార్

రేషన్ బియ్యం పక్కదారి పడితే చర్యలు

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్19:రేషన్ బియ్యం పక్కదారి పడితే డీలర్లపై చర్యలు తప్పవని తహసీల్దార్ మహ్మద్ ఏజీ రహీం హెచ్చరించారు. మంగళవారం మద్దూరు మండల రేషన్ డీలర్లతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఇటీవల కాలంలో రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నట్లు గుర్తించామన్నారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా విక్రయిస్తే ఉపేక్షించేదిలేదన్నారు. నెలనెలా రేషన్ బియ్యాన్ని సక్రమంగాసరఫరా చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని సూచించారు. సమావేశంలో ఆర్ఐ రమేశ్, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లతో సమావేశమైన తహసీల్దార్ రహీం

ర్యాగింగ్ చేయడం నేరం

ములుగు, నవంబర్ 19: ర్యాగింగ్ చేయడం నేరమని, తోటి విద్యార్థులను ర్యాగింగ్ పేరిట ఇబ్బందులకు గురిచేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి హెచ్చరించారు. మండలంలోని లక్ష్మక్కపల్లిలోని ఆర్‌వీశ్రీం మెడికల్ కళాశాలలో విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల చైర్మన్ డాక్టర్ యాకయ్య, గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై విజయ్‌కుమార్, మెడికల్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏసీపీ పురుషోత్తంరెడ్డి

పేదలకు దుప్పట్లు పంపిణీ

సిద్దిపేట టౌన్,నవంబర్ 19 : మానవ సేవే మాధవ సేవ అని మాజీ ఉప సర్పంచ్ చెందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట ఎన్జీవోస్ భవన మాజీ అధ్యక్షుడు,విశ్రాంత ప్రధానోపాధ్యయుడు చెందిరెడ్డి రాంరెడ్డి జ్ఞాపకార్థం అతడి కుమారుడు చెందిరెడ్డి హేమంత్‌రెడ్డితో కలిసి మంగళవారం స్థానిక నాయీబ్రాహ్మణ కాలనీలో పేదలకు శ్రీనివాస్‌రెడ్డి దుప్పట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కాలనీలో సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామన్నారు.కాలనీని దత్తత తీసుకొని సొంత నిధులతో అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కాలనీ వాసులు శ్రీనివాస్,శ్రీకాంత్,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న చెందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

ఆయుష్మాన్ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా అధికారి

వర్గల్, నవంబర్19: మండలకేంద్రంలోని ఆయుష్మాన్ ఆరోగ్యకేంద్రాన్ని మంగళవారం జిల్లా అధికారి పల్వాన్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్యసేవలను అక్కడ ఉన్న వారిని అడిగితెలుసుకున్నారు. మందుల పంపిణీ, రికార్డులను పరిశీలించారు. అనంతరం వైద్యసిబ్బందితో యాంటీబెటిక్ మందులు ఎక్కువ వాడరాదని ప్రతిజ్ఞ చేయించారు. ఆతర్వాత నిర్మాణంలో ఉన్న కొత్త ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రాథమిక కేంద్రం డాక్టర్ మేరి మీనాకుమారి, ఆయుష్ డాక్టర్ శిరీష , సీహెచ్‌వో రవీందర్‌రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాస్, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న పల్వాన్‌కుమార్

భూసేకరణకు సహకరించాలి

కోహెడ, నవంబర్ 19: గౌరవెల్లి ప్రాజెక్టు కాల్వ నిర్మాణానికి రైతులు, ప్రజలు సహకరించాలని ఆర్డీవో రామ్మూర్తి కోరారు. మంగళవారం మండలంలోని కూరెల్లలో భూసేకరణపై గ్రామ సభ నిర్వహించి మాట్లాడారు. ప్రాజెక్టులు , కాల్వల నిర్మాణం జరిగితే సాగు నీరు వచ్చి రైతులకు మేలు జరుగుతుందని, భూములు పోయే రైతులకు కొంత ఇబ్బంది జరిగినా నష్టపరిహారాన్ని ప్రభుత్వం ఇచ్చేందుకు సిద్ధంగా ఉందన్నారు. రేపటి నుంచి భూసేకరణకు అధికారులు భూములను సందర్శిస్తారని, రైతులు ఏమైనా సమస్యలుంటే అర్జీలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ దేవేంద్ర, భూసేకరణ డిప్యూటీ తహసీల్దార్ అరవింద్, ఆర్ఐ ఎల్లయ్య, నీటిపారుదలశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్డీవో రామ్మూర్తి

నాచగిరిలో దీపోత్సవం

వర్గల్, నవంబర్ 19: నాచగిరి లక్ష్మీనృసింహ స్వామి దేవాలయంలో కార్తిక మాసాన్ని పురస్కరించుకొని మంగళవారం సాయంత్రం ఆలయ వేదపండితులు దీపోత్సవాన్ని నిర్వహించారు. ఆలయంలో మహిళలు దీపాలు వెలిగించి కార్తిక పురాణ ప్రవచనాల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఎస్.అన్నపూర్ణ, వేదపండితులు పాల్గొన్నారు.

నాచగిరి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

తంగళ్లపల్లిలో స్వయం పరిపాలన

కోహెడ, నవంబర్ 19: మండలంలోని ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం జరుపుకొన్నారు. ప్రధానోపాధ్యాయురాలిగా కె.ప్రణీత, డీఈవోగా వై.అభినయ్ విధులు నిర్వహించి ఆకట్టుకున్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వయం పరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

మజీద్‌పల్లిలో శివపార్వతుల కల్యాణం

వర్గల్, నవంబర్ 19: మండలంలోని మజీద్‌పల్లిలో కార్తిక మాసాన్ని పురస్కరించుకొని రుద్రాభిషేకం, కార్తిక దీపారాధన, శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ లతా రమేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ లతాశివరామ్ గౌడ్, ఆలయ దాత గూడాల మనోహర్, కృష్ణమూర్తిగుప్తా, గ్రామస్తులు పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

చేర్యాల: కొమురవెల్లి మల్లన్న ఆలయంలో శివాకృతి రూపంలో దీపోత్సవం

ఆకట్టుకున్న చిందు యక్షగానం

చేర్యాల, నవంబర్ 19: రాజరాజేశ్వర జానపద కళా బృందం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో ద్వావింశతి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని ఆకునూరులో గజ్జెల జమదగ్ని ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాకారులు చిందు యక్షగానం, బోనాలు, కోలాటం, దాండియా తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

ఉపాధి ప